ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ

- మా హామీని నిలబెట్టుకుంటాం
- తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగ సమస్యే కారణం
- పదేండ్ల పాటు ఈ అంశాన్ని పట్టించుకోని బిఆర్ఎస్ సర్కార్
- నర్సుల నియామకాలపై హరీశ్‌వి అర్థం లేని మాటలు
- స్టాఫ్ నర్సులకు నియామకపత్రాల అందజేత కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

నర్సులకు నియామక పత్రాలు అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన 6,956 మంది నర్సింగ్ ఆఫీసర్ల (స్టాఫ్ నర్సులు)కు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఎస్‌పిఎస్‌సి ద్వారా ఉద్యోగ నియామకాలను చేపడతామని తెలిపారు. త్వరలో 15 వేల పోలీసు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికే టిఎస్‌పిఎస్‌సి ప్రక్షాళన దిశగా కొత్త చైర్మన్, సభ్యులను నియమించినట్టు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలు ఏడాది కాలంగా ఆలస్యమవుతున్న విషయం తన దృష్టికి రాగానే సమీక్ష నిర్వహించి నియామక పత్రాల అందజేతకు ఆదేశించినట్టు వివరించారు.

నిరుద్యోగ సమస్యే తెలంగాణ ఉద్యమానికి కారణమనీ, అయితే ఆ సమస్యను గత పదేండ్ల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఈ సందర్భంగా విమర్శించారు. నిరుద్యోగుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడితే పదేండ్లు వారి ఆకాంక్షలను నెరవేర్చకుండా కెసిఆర్ తన కుటుంబంలో వారి ఉద్యోగాల కల్పనపైన్నే ధ్యాస పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా నియమితులైన నర్సులను చూసి ఫాంహౌజ్‌లో ఉన్న వారు కుళ్లుకున్నా సరే... ప్రజలను సంతోషపెట్టేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బిఆర్ఎస్ నేత హరీశ్ రావు శాపనార్థాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని ఎద్దేవా చేశారు. ఆరోగ్య తెలంగాణలో నర్సుల పాత్ర కీలకమని ఆయన అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సార్థకత వచ్చిన రోజుగా బుధవారం నిలిచిందని తెలిపారు. నిరుద్యోగుల కలల సాకారంలో ఇది తొలి అడుగని చెప్పారు. రాష్ట్ర అవసరాలు, అప్పులు, ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థ నడుమ దాదాపు రూ.500 కోట్ల భారం పడుతున్నా సరే, నర్సుల పోస్టుల భర్తీకి తమ సర్కారు ముందుకొచ్చిందని చెప్పారు. వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మరో ఐదు వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని తెలిపారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమం ముఖ్యమనీ, ఆ దిశగా తమ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. జన్మించిన తర్వాత మరణించే వరకు ప్రజలకు సేవలందించేది నర్సులని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పాల్గొన్నారు.

సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయి పెంపు : సిఎం

గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీసు విభాగాలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని సిఎం సూచించారు. అందులో నిపుణులైన కన్సల్టెన్సీలకు బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయించాలన్నారు. పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేరని సమావేశంలో చర్చకు వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే తగినంత మంది హోంగార్డుల నియామకాలు చేపట్టాలని ఆదేశించారు. మూడు నెలల్లోగా ఈ నియామకాలు జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో (పీక్ అవర్స్‌లో) లా అండ్ ఆర్డర్ పోలీసులను గ్రేటర్ సిటీ ట్రాఫిక్ కంట్రోల్ విధులకు వినియోగించుకోవాలని అన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వాటికి సరిపడే సంఖ్యలో సిబ్బంది నియామకాలు చేపడుతామని సిఎం చెప్పారు. ఎల్బీ నగర్ జంక్షన్ తరహాలో సబ్ వే, అండర్ పాస్, సర్ఫేస్ వేలను ఎక్కడెక్కడ నిర్మించాలి... అక్కడున్న సాధ్యాసాధ్యాలను గుర్తించాలని సిఎం అన్నారు.

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పోలీస్ అధికారులు, మున్సిపల్ జోనల్ కమీషనర్లు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రయివేటు, ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని, పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వ పరంగా రాయితీలు ఇవ్వాలని సిఎం అన్నారు.

హైదరాబాద్ లో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు ఆ ఏరియాలో ఉండే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకోవాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి రవి గుప్తా, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్, సిఎంఒ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ..

- బైక్‌పై ఖమ్మం నగరంలో మంత్రి పొంగులేటి పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరు నియోజకవర్గానికి సంబంధించిన ఖమ్మం నగరంలోని శివారు డివిజన్లలో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలియ తిరిగారు. బుధవారం ఉదయం 6.45 గంటల కల్లా ఆకస్మికంగా 1, 59, 60 డివిజన్‌ల పరిధిలోని కైకొండాయిగూడెం, దానవాయిగూడెం, రామన్నపేటలో అడుగిడిన మంత్రిని చూసి స్థానికులు సైతం అవాక్కయ్యారు. ఎలాంటి సమాచారం లేకుండా మంత్రి రావడంతో సమస్యలు చెప్పుకునేందుకు జనం రోడ్ల మీదకు వచ్చారు. కొందరు అప్పటికప్పుడు వినతులు రాసుకొని వచ్చి మరీ పొంగులేటికి ఇచ్చారు. రోడ్లు, డంపింగ్‌యార్డులు, పారిశుధ్య, తాగునీరు, మున్నేరు ముంపు తదితర స్థానిక సమస్యలన్నింటినీ ప్రజలు ఏకరువు పెట్టారు. మంత్రి రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతూ వచ్చారు. అందుబాటులో ఉన్న అధికారులకు సమస్యలపై అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఆయా సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన వివరణ ఇవ్వకుండా.. నిర్లక్ష్యం వహించే అధికారుల తీరును జనం మంత్రి ముందు ఉంచారు. ప్రభుత్వ అధికారుల ద్వారా ఎదురవుతున్న సమస్యలనూ జనం వివరించారు. తక్షణ చర్యలకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న డంపింగ్‌యార్డును దానవాయిగూడెం సమీపంలోని ఎన్ఎస్‌పి బ్రిడ్జి మీదుగా పరిశీలించారు. సిసి రోడ్లు కూడా లేకపోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు వివరించారు. రామన్నపేట శ్మశానవాటిక అన్యాక్రాంతం అవుతున్న దృష్ట్యా దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రామన్నపేట కాలనీలో మున్నేరు ముంపు ఆర్‌సిసి వాల్ నిర్మాణంతో నిర్వాసితులుగా మారేవారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలన్నారు. రామన్నపేట చెరువు నుంచి వచ్చే వరద కాలువ నీరు ఇండ్లలోకి రాకుండా చూడాలని తెలిపారు. రామన్నపేట ఊళ్లో వరద కాలువ వచ్చే ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- 16న ఇంగ్లీష్ సబ్జెక్టుకు కూడా...
- వార్షిక పరీక్షలకు 9.22 లక్షల మంది హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 15 వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 4,78,527 మంది విద్యార్థులకు మొదటిసారిగా ఇంగ్లీష్ సబ్జెక్టుకు ఈనెల 16న ప్రాక్టికల్ పరీక్షలుంటాయి. ప్రాక్టికల్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2032 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,21,803 మంది విద్యార్థులు హాజరవుతారు. ఎంపిసి విభాగం నుంచి 2,17,714 మంది, బైపిసి విభాగం నుంచి 1,04,089 మంది, జియాలజీ నుంచి 144 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం నుంచి 48,277 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 46,542 మంది కలిపి మొత్తం 4,16,766 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ఈనెల 17న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతికత, మానవ విలువలు పరీక్ష ఉంటుంది. ఈనెల 19న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తారు. బుధవారం ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు. రోజుకు 30 నుంచి 40 మంది విద్యార్థులు ఫోన్ చేసి సంప్రదిస్తున్నారని వివరించారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు ప్రథమ సంవత్సరం నుంచి 4,78,527 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,43,993 మంది కలిపి 9,22,520 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ నెల 28 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని అన్నారు.

తెల్లరేషన్ కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీ అమలు చేయండి : నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీని అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఈ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ఆరోగ్యశ్రీ పథకానికి, తెల్లరేషన్‌కార్డుకు ఉన్న సంబంధాన్ని తొలగించడాన్ని స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 77 శాతానికిపైగా తెల్లరేషన్ కార్డుదారులున్నారని వివరించారు. అభయహస్తం దరఖాస్తులో ఎనిమిది లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ కార్డులున్న కొంత మంది రూపాయికి కిలోబియ్యం తీసుకుని వాటిని కిలో పది రూపాయలకు మధ్య దళారీలకు అముకుంటున్నారని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా అమలు చేయడం వల్ల ఆ కార్డు కావాలనే కుటుంబాల సంఖ్య తగ్గే అవకాశముందని వివరించారు.

మున్సిపల్ అవిశ్వాసాలపై అప్పీళ్లు డిస్మిస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జనగాం, ఆలేరు, దమ్మాయిగూడ, సదాశివపేట, ఆందోల్ జోగిపేట, జవహర్‌నగర్ మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలను సవాల్ చేసిన పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. గతంలో సింగిల్ జడ్జి ఆదేశాల జారీకి నిరాకరించడంతో ఆ చైర్మన్లు అప్పీల్ పిటిషన్లు వేశారు. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఆ మున్సిపాల్టీల చైర్‌పర్సన్లుగా చేసిన పి.జయమ్మ, జమున, జి. మల్లయ్య, ఎం.కావ్య, వి శంకరయ్య, వి ప్రణీత వేసిన అప్పీళ్లపై ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అవిశ్వాస అంశం మున్సిపల్ చట్టం-2019లో లేదనీ, ఆ చట్టంలోని సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మాన ఆమోదానికి ఆస్కారం లేదని పిటిషనర్ల లాయర్లు వాదించారు. పాత మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 48లో అందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. ఇప్పుడున్న చట్ట ప్రకారం అవిశ్వాస అంశం లేదని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే అవిశ్వాస ప్రక్రియ పూర్తయ్యిందని ప్రభుత్వం చెప్పింది. వాదనల తర్వాత అప్పీళ్లను హైకోర్టు డిస్మిస్ చేసింది.

ప్రత్యేకపాలనపై స్టేకు హైకోర్టు నిరాకరణ

- సర్పంచులకు భంగపాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేకపాలనపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్నికలు జరిగే వరకు తమనే పదవిలో ఉండేలా చూడాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. అదే సమయంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ శరత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 31తో తమ పదవీ కాలం ముగియనుందనీ, పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని, ఎస్ఇసిని ఆదేశించాలని కోరుతూ జనగాం జిల్లా కాంచనపల్లి, చెంగెర్ల, నిర్మల్ జిల్లా తల్వాడ, కరీంనగర్ జిల్లా నిజాయతీగూడెం సర్పంచులు విజయ, వేణు గోపాల్, అనిల్‌కుమార్, మురళీధర్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలు జరిగే వరకు పాలనను తమకే అప్పగించాలనీ, ప్రత్యేక అధికారుల నియామకంపై స్టే ఇవ్వాలని సర్పంచ్‌ల న్యాయవాదులు బెంచ్‌ను కోరారు. ప్రత్యేకాధికారుల నియామకాలు చేపట్టకుండా ఆపాలని విన్నవించారు. రాజ్యాంగంలోని 243ఇ, 243కె అధికరణాలకు విరుద్ధంగా ఎన్నికల సంఘం చర్యలు ఉన్నాయనీ, పంచాయతీరాజ్ చట్టం-2018 రూల్స్‌ను అమలు చేయడంలేదని వాదించారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల ప్రక్రియకు చర్యలు తీసుకోలేదనీ, ఓటర్ల జాబితాను కూడా సిద్ధం చేయలేదని తెలిపారు. వాదనల తర్వాత స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.

పార్టీ కోసమే నా జీవితం

- అలా లేకుంటే ఎన్నేండ్లు బతికి ఏం లాభం
- పార్టీ పని, ఆరోగ్యం రెండింటినీ సమన్వయం చేసుకోవాలి
- సిపిఎం నాయకులు, కార్యకర్తలతో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఎన్నేండ్లు బతికినా ఎందుకోసం బతకాలి. అలా అని ఏదీ తక్కువ చేసి చూడొద్దు. చస్తే చస్తాం జెండా కప్పుతారని అనుకోవడం పిచ్చితనం. పుస్తకాలు చదువుతూ ఆరోగ్యంగా ఎక్కువ కాలం బతకడం వల్ల ఉపయోగమేంటీ?. పార్టీ కోసం ఉపయోగం లేకుండా ఎన్నేండ్లు బతికితే ఏం లాభం. అందుకే ఆరోగ్యాన్ని, పార్టీ పనిని రెండింటినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలి. పార్టీ కోసం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఆరోగ్యం కోసం పార్టీ పనిని వదిలేది లేదు'అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కిడ్నీ, గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన గతనెల 16న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన విషయం తెలిసిందే. గతనెల 29న ఆయన డిశ్చార్జి అయ్యారు. రెండురోజులపాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నారు. డిశ్చార్జి అయ్యాక తొలిసారి సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌కు ఆయన బుధవారం వచ్చారు. ఆ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. వారం, పది రోజులపాటు విశ్రాంతి అవసరమనీ, ఖమ్మం వెళ్లొద్దనీ, ప్రయాణం చేయొద్దని డాక్టర్లు సూచించారని అన్నారు. భౌతికంగా ఎక్కువ ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఐదు నిమిషాలు నడవాలన్నారని చెప్పారు. శ్వాస సమస్య ఎక్కువైతే నడక ఆపాలన్నారని వివరించారు. అయితే తనకు గుండె వద్ద పేస్‌మేకర్‌ను అమర్చారని అన్నారు. టీవీలకు స్టెబిలైజర్‌లాగా అది పనిచేస్తుందన్నారు. గుండె ఎక్కువ సార్లు కొట్టుకుంటే తగ్గిస్తుందనీ, తక్కువసార్లు కొట్టుకుంటే పెంచుతుందని చెప్పారు. ఒకవేళ గుండెపోటు వస్తే సీపీఆర్ అదే చేస్తుందని అన్నారు. ఆ పరికరంలో ఇన్ని సౌకర్యాలున్నాయని వివరించారు. తాను ఆస్పత్రిలో ఉన్నపుడు ఎవరినీ కలిసే అవకాశం లేదన్నారు. తన ఆరోగ్యం రీత్యా అక్కడి సిబ్బంది, డాక్టర్లు కఠినంగా వ్యవహరించారని చెప్పారు. అయితే తాను 2004లో ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు గుండె సమస్య వచ్చిందన్నారు. అప్పుడే స్టంట్ వేశారని గుర్తు చేశారు. 20 ఏండ్ల వరకు ఎలాంటి సమస్య రాలేదని అన్నారు. ఇప్పుడూ గుండె వల్ల సమస్య లేదనీ, ఊపిరితిత్తుల్లో నీరు నిల్వ ఉండడమే సమస్యకు కారణమని చెప్పారు. శ్వాస సంబంధ సమస్య వచ్చిందన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో చాలా కార్యక్రమాలను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. నీరు నిల్వ ఉండడం వల్ల గుండె ఎక్కువసార్లు కొట్టుకున్నదని అన్నారు. సాధారణంగా 70 లేదా 80 సార్లు గుండె కొట్టుకోవాలి కానీ తనకు 160 సార్లు కొట్టుకున్నదని వివరించారు. సంక్రాంతి పండగ రోజు కొంత ఇబ్బందిగా అనిపించిందనీ, వెంటనే తమ పాప డాక్టర్ కావడం వల్ల ప్రథమ చికిత్స చేసిందనీ, అది కొంత ఉపయోగపడిందని చెప్పారు. వెంటనే ఖమ్మంకు తరలించారనీ, అక్కడి నుంచి అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు తీసుకొచ్చారని వివరించారు. శ్వాస సంబంధిత సమస్య ఉండడం వల్ల వెంటనే వెంటిలేటర్ అమర్చారని అన్నారు. గతనెల 26న పేస్‌మేకర్‌ను అమర్చారనీ, గుండెను సాధారణ స్థితికి తీసుకొచ్చారని చెప్పారు.

తమ్మినేని ఆరోగ్యం అంతే ముఖ్యం : నంద్యాల నర్సింహారెడ్డి

తమ్మినేని పార్టీకి సేవ చేయడం ఎంత ముఖ్యమో, పార్టీకి ఆయన ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని సిపిఎం సీనియర్ నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. డాక్టర్ల సూచనలను పాటించాలనీ, ఒత్తిడికి గురయ్యే పనులు చేయొద్దని సూచించారు.

ఇప్పుడే పరామర్శించడానికి వెళ్లొద్దు : టి జ్యోతి

తమ్మినేని అనారోగ్యం గురించి తెలిసిన వెంటనే ఎంతో ఆందోళనకు గురయ్యామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి చెప్పారు. ఆయన హెల్త్ బులెటిన్ విడుదలయ్యాక, ఆరోగ్యం నిలకడగా ఉందంటూ చెప్పిన తర్వాత కొంత ఉపశమనం కలిగిందని అన్నారు. ఇప్పుడే ఎవరూ ఇంటికెళ్లి పరామర్శించొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి సాగర్, ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహిస్తున్నారు. బుధవారం సంస్థ నిర్వాహకులు ఖాలిద్ మేళా ప్రాంగణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5 వరకు జరగనున్న ఎగ్జిబిషన్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగనున్న పూల మొక్కల ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 160 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రూ.మూడు నుంచి రూ.16 లక్షల వరకు విలువ గల అరుదైన మొక్కలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విలీన సమస్యలు పరిష్కరించండి

- రవాణామంత్రికి ఎన్ఎంయు విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులో, ఆర్‌టిసి ఉద్యోగులో అర్థంకాని అయోమయంలో ఉన్నారని టిఎస్‌ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎమ్‌యూ) పేర్కొన్నది. బుధవారం యూనియన్ అధ్యక్షులు కమాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్ నరేందర్, జనరల్ సెక్రటరీ మహ్మద్ మౌలానా బృందం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ నేతృత్వంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు విలీన ప్రకటన చేసిందనీ, గవర్నర్ గెజిట్ విడుదల చేశారనీ, కానీ ప్రభుత్వం మారడం వల్ల ఈ ప్రక్రియ ఏ స్థితిలో ఉందో తెలియక ఉద్యోగులు గందరగోళంలో ఉన్నారని వివరించారు. గెజిట్ ప్రకారం అపాయింట్‌మెంట్ తేదీ ప్రకటించి ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని రవాణామంత్రికి అందచేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

- సిఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతు సంఘం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ రైతు సంఘం సిఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపింది. రైతుల సమస్యలపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని ఆ సంఘం నేతలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములతో కూడిన బృందం సిఎంకు వినతిపత్రం అందజేసింది.

వినతిపత్రంలోని ముఖ్యాంశాలివే....

– భూమాతగా ప్రకటించిన ధరణిలో 20 లోపాలున్నట్టు గత బిఆర్ఎస్ క్యాబినెట్ కమిటీ అంగీకరించింది. వాటిని సరిచేయడానికి మీసేవ ద్వారా ప్రతి రైతు రూ.1650 చెల్లించారు. మొత్తం రాష్ట్రంలో 4.5 లక్షల మంది డబ్బులు చెల్లించి ధరఖాస్తులు పెట్టుకున్నారు. భూ సమస్యల్లో నెలకొన్న లోపాలను సవరించి అందరికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. సమగ్ర భూసర్వే నిర్వహించాలి.

– రెవెన్యూ రికార్డులలో కౌలు రైతుల పేర్లు, వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయుటకు రెవెన్యూ రిజిస్టర్‌లో 'కాలం'ను ఏర్పాటు చేయాలి. వారి పేర్లు నమోదు చేయాలి. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలి.

– గత రాష్ట్ర ప్రభుత్వం 'కేంద్ర పీఎం ఫసల్ బీమా' నుంచి వైదొలిగింది. అప్పటినుంచి రాష్ట్ర రైతులకు ఎలాంటి పరిహారం రావడం లేదు. రాష్ట్రంలో ఏటా రూ.5వేల కోట్ల విలువగల పంటలు దెబ్బతింటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించాలి. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి నష్టపోయిన పంటలకు పరిహారం అందేలా చూడాలి.

– ప్రాధాన్యతాక్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలి. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులను రానున్న ఏడాదిలో పూర్తి చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. కాళేశ్వరం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని 'హైకోర్టు జడ్జి' ద్వారా విచారణ జరిపించాలి. సబ్సిడీపై మైక్రోఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్) పథకాలు అమలు చేయాలి. ఐడీసీ నిర్వహణలోని లిఫ్ట్ పథకాలను రిపేర్లు చేయాలి.

– గతంలో విడుదల చేసిన 69 జిఒ ప్రకారం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని విస్తరించి పూర్తి చేయాలి.

– రాష్ట్రంలో వ్యవస్థీకృతంగా కల్తీ విత్తనాల వ్యాపారం సాగుతున్నది. ఏటా 4, 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. కల్తీ విత్తనాలను పట్టుకోవడమే తప్ప నేరస్తులపై ఎలాంటి శిక్షలు లేవు. నష్టపోయిన రైతులకు పరిహారాలు లేవు. 'రాష్ట్ర విత్తన చట్టా'న్ని రూపొందించాలి. కల్తీ విత్తన సంస్థల కంపెనీలను రద్దు చేయాలి.

– గత రెండేండ్లుగా వ్యవసాయ శాఖ 'యాక్షన్ ప్లాన్' ప్రకటన లేదు. వెంటనే వార్షిక ప్రణాళికలు ప్రకటించాలి. ఆయా ప్రాంతాల భూసారాన్ని బట్టి, రాష్ట్ర అవసరాలను బట్టి పంటల విధానాన్ని రూపొందించాలి.

– మ్యానిఫెస్టోలో ప్రకటించిన రైతు భరోసా పథకం ప్రకారం ఎకరాకు రూ.15,000 చొప్పున రైతుల ఖాతాలో వేయాలి. వానాకాలం పంటలకు సంబంధించి ఎకరాకు రూ.7,500 చొప్పున వాస్తవ సాగుదారులందరికి వారి ఖాతాలలో జమ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు, బోనస్ అమలు చేయాలి. లీటర్ పాలకు రూ.5 బోనస్ అమలుకు నిధులు విడుదల చేయాలి. రూ. రెండు లక్షల లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలి. ఆర్‌బీఐ ప్రకారం 18 శాతం 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలి.

జీవవైవిధ్యానికి ఆలవాలం చిత్తడి నేలలు

- పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలకు ప్రమాదకరం
- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జీవవైవిధ్యానికి చిత్తడి నేలలు ఆలవాలమనీ, వాటిని పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. చిత్తడి నేలల పరిరక్షణకు సమర్థవంతమైన కార్యాచరణను అమలుచేయాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొందని నొక్కిచెప్పారు. తెలంగాణలోని చిత్తడి నేలల పరిరక్షణ, వాటి గుర్తింపు తదితర అంశాలకు సంబంధించి బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్టేట్ వెట్ ల్యాండ్స్ అథారిటీ చైర్మన్, మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజంగా, కాలువల ప్రవాహంతో, మనుషుల ప్రమేయంతో ఏర్పడిన చిత్తడి నేలలను గుర్తించడంతో పాటు వాటి పరిరక్షకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలనీ, ఒక్కొక్క శాఖ నుంచి నోడల్ అధికారి ఈ వివరాలను చిత్తడి నేలల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి అందజేయాలని సూచించారు. తద్వారా ఆ నేలల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టే అవకాశం కలుగుతుందన్నారు. 'రామ్ సర్ ఒప్పందం'లోని ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశంలో 75 సైట్లుండగా, తెలంగాణలో ఒక్క సైట్‌నూ గుర్తించకపోవడం విచారించాల్సిన విషయమని చెప్పారు. గత ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని విమర్శించారు.

NOTICE
IN THE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
I.A.No.161/2023 in O.S. No:130/2017

Between:
Patchala Rama Krishna
...Petitioner /Plaintiff
And
Medarametla Samba Siva Rao and Others
… Respondents/Defendants

To.
R-2: Medarametla Kranthi Kumar, S/o.Samba Siva Rao, R/o. Door No: 12-9-16, Sai Baba Nagar, Road No:4, Plat No:68, H.M.T.Town Ship, Hyderabad, (proposed defendant No-2)

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం:161/2023లో 2వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:03-01-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:12-02-2024

సానికొమ్ము సుబ్బారెడ్డి,
పిటీషనర్/వాది తరపు న్యాయవాది,
గుంటూరు.

పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి

- కార్పొరేట్లకు కార్మికుల ప్రయోజనాలు తాకట్టు
- మా పోరాటం కార్పొరేట్, మతోన్మాదుల మీదనే : తపన్‌సేన్
- బిజెపిని ఓడించకపోతే హక్కులుండవు : బివి రాఘవులు
- కార్మికుల మహా ర్యాలీ, బహిరంగసభ
- నేటి నుంచి 3 వరకు జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్లకు కార్మిక, కర్షకుల ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న బిజెపిని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఫాతిమా నగర్ బాలవికాసలో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరగనున్న సిఐటియు జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం కార్మికుల మహార్యాలీ, బహిరంగసభ నిర్వహించారు. హన్మకొండలోని వేయిస్థంబాల గుడి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ హన్మకొండ చౌరస్తా మీదుగా అశోక్ థియేటర్ నుంచి పబ్లిక్ గార్డెన్‌కు చేరింది. ఈ ర్యాలీని సిఐటియు ఆలిండియా కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రారంభించారు. డప్పు చప్పుళ్ల నడుమ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మహా ప్రదర్శన అనంతరం డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

తొమ్మిదిన్నరేళ్లుగా మోడీ విద్వేష, మత రాజకీయాలు : తపన్‌సేన్

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదిన్నరేళ్లుగా విద్వేష, మత రాజకీయాలు చేస్తున్నారని తపన్‌సేన్ అన్నారు. దేశ ప్రజల జీవితాలు సంక్షోభంలో కూరుకు పోయాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, బడా వ్యాపారులకు మేలు చేసే విధానాలను అమలు చేస్తూ వారికి మాత్రమే లాభాలు వచ్చేలా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు కేంద్రం వత్తాసు పలికి కార్మికు హక్కులను అణిచివేసిందన్నారు. మన పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తుల మీదనేనన్నారు. అన్ని రంగాలను ప్రయివేటీకరిస్తున్న మోడీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. మనల్ని రక్షించుకోవడం ద్వారా మనం దేశాన్ని రక్షించాలన్నారు. గతేడాది నవంబర్ 26, 27, 28 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా నిర్వహించిన 'మహా పడావ్'లో ఏడు లక్షల మంది కార్మికులు పాల్గొని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగిందన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మె కూడా విజయవంతమైందని తెలిపారు. జనవరి 22న అయోధ్యలో రామాలయం ప్రారంభించి.. తనవల్లే రామాలయ నిర్మాణం సాధ్యమైందని ప్రచారం చేసుకుంటూ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నెల రోజులుగా ఇటువంటి ప్రచారంలోనే కేంద్ర ప్రభుత్వం నిమగ్నమై ఉందన్నారు.

కేంద్రంలోని బిజెపి తన మత ఎజెండాతో ముందుకు వెళ్తున్నా, మనం మన ఎజెండాతో ముందుకు సాగుతూనే ఉన్నామన్నారు. ఇందులో భాగంగానే జనవరి 26న అన్ని రాష్ట్రాల్లో రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ట్రాక్టర్, ద్విచక్ర వాహన ర్యాలీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే, బిజెపిని గద్దె దింపేందుకు ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

బిజెపిని ఓడించకపోతే హక్కులుండవు : బివి రాఘవులు

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించకపోతే దేశంలో హక్కులుండవని ఉమ్మడి ఏపి సిఐటియు పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బివి రాఘవులు హెచ్చరించారు. బిజెపిని ఓడించడమే కర్తవ్యం కావాలన్నారు. దేశంలో మోడీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి, హక్కులకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ప్రశ్నించే కవులు, మేధావులు, ఉద్యమకారులను మోడీ జైల్లో పెట్టించారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావుల ఆరోగ్యం బాగో లేకపోయినా జైళ్లల్లో వేసి ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని రూపుమాపాలని ప్రకటించారని, దీనిపై బిజెపి నేతలు పెద్ద పెట్టున దుష్ప్రచారం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి.. గత పార్లమెంటు ఎన్నికల్లో 17 శాతం ఓట్లు, 4 పార్లమెంటు సీట్లు గెలిచారని, ఈసారి ఆ ఓట్లు, సీట్లు కూడా రాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో వెంటనే కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక విధానాన్ని రూపొందించాలని సిఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. నెలకో, రెండు నెలలకోమారు కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, చర్చల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. 4.50 కోట్ల తెలంగాణ ప్రజల్లో 1.50 కోట్ల మంది కార్మికులున్న విషయాన్ని నాటి సీఎం కేసీఆర్, నాటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు గుర్తించలేదన్నారు. ఈ సభలో సిఐటియు ఆలిండియా కార్యదర్శి ఎఆర్ సింధు, రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తదితరులు మాట్లాడారు. పాల్గొన్న వారిలో.. సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, రాగుల రమేష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎన్. రజిత, బొట్ల చక్రపాణి, ఎం చుక్కయ్య, సారంపల్లి వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల

- తాగునీటి అవసరాల కోసమే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వ ద్వారా ఎన్ఎస్‌పి అధికారులు బుధవారం నీటిని విడుదల చేశారు. పాలేరు జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో ప్రాజెక్టు ఉన్నతాధికారులు రోజుకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. ఆరు రోజులపాటు సుమారు ఆరు వేల టిఎంసిలు వీటిని ఎడమకాల్వకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని, నీటిని పొదుపుగా ఉపయోగించాలని అధికారులు కోరారు.

సినీ కళాకారులకు గద్దర్ పేరిట అవార్డ్స్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

ఇటీవల సినీ కళాకారులు తనను కలిసి గత ప్రభుత్వం నిలిపేసిన నంది అవార్డ్సను పునద్ధరించాలని కోరారని తాను వారికి నంది కాదు గద్దర్ పేరిట అవార్డ్స్ ఇస్తామని చెప్పానని ఇప్పుడు బహిరంగంగా ప్రకటిస్తున్నానని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ రేవంత్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లాకు గద్దర్ పేరు, టాంక్ బండ్‌పై అయన విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. రవీంద్ర భారతి ప్రధాన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా నిర్వహించింది. ముఖ్య అతిథిగా సిఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గద్దర్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. పొలిటీషియన్ లేదా క్రిమినల్‌నీ ఎదుర్కోవటం సులువు కానీ క్రిమినల్ పొలిటీషియన్‌ను ఎదిరించి నిలవటం కష్టమని గద్దర్ చెప్పేవారని గుర్తు చేశారు. నిక్కర్ పార్టీనీ లిక్కర్ పార్టీనీ వొడిస్తెనే సమ సమాజం వస్తుందని గద్దర్ అనేవారని లిక్కర్ పార్టీనీ ఇంటికి పంపామని రాబోయే ఎన్నికల్లో నిక్కర్ పార్టీనీ ఒడించటానికి ప్రజల సహకారం అవసరం అన్నారు. గద్దర్ తెలంగాణ సంస్కృతికి బ్రాండ్ అంబాసిడర్ అన్న సిఎం...ఆయన జయంతి నాడు కళాకారులకు సాహిత్య కారులకు అవార్డ్స్ ఇస్తామని ప్రకటించారు. ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. నాడు ప్రభుత్వం నక్సలైట్ ల మధ్య చర్చల్లో పేదలకు భూమి పంపిణీ ప్రధాన సమస్య అని తేలిందని, గద్దర్ కూడా అదే కోరుకున్నారని తెలిపారు. గద్దర్ ఒక కులం ప్రాంతంకు చెందిన వారు కారనీ అయన విశ్వమానవుడు అన్నారు. అయన ఆలోచనలు పాటలు అన్నీ మా ప్రభుత్వం ప్రజల సహకారంతో కాపాడుకుంటమన్నారు. పర్యటక సాంస్కృతిక శాఖ మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కూనంనేని, మధు యాష్కీ, ప్రజా గాయకుడు జయ రాజ్, గద్దర్ కుమార్తె వెన్నెల, సిపిఎం నేత రాములు, గద్దర్ ఫౌండేషన్ స్థాపకుడు సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభ వద్ద టిమ్స్ నర్సుల ఆందోళన

- అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలంటూ టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సిఎం సభ జరుగుతున్న స్టేడియం బయట నిరసన చేపట్టారు. దాంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. కొత్తగా ఎంపికైన స్టాఫ్ నర్సులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించేందుకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఎల్బీ స్టేడియంలో బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి సభ జరిగింది. ఈ క్రమంలో గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రికి చెందిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు స్టేడియం ఎదుట రోడ్డుపై బైటాయించి, ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. దాంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొనగా.. పోలీసులు నర్సులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులు మాట్లాడుతూ.. ఎంతో కాలం నుంచి కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు 20 శాతం వెయిటేజ్ మార్కులు కలిపి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సిఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు ఈ నెల 2న రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటిడిఎ ఇన్‌చార్జి పిఒ ఖుష్బూ గుప్తాతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా నాగోబా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆమెకు నాగోబా మోమెంటోను బహూకరించి శాలువాతో సన్మానించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. దర్బార్ ఆవరణలో జరుగుతున్న గ్రౌండ్ చదును పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దర్బార్ హాలులో ముఖ్యమంత్రితో పొదుపు సంఘం మహిళలతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి వనంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. ఆనాడు జల్, జంగల్, జమీన్ కోసం అమరులైన ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. మంత్రి వెంట ఎస్‌పి గౌస్ ఆలం, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతో, ఇఇలు భీంరావ్, నర్సయ్య, డిడి దిలీప్‌కుమార్, సర్పంచ్ రేణుకానాగ్‌నాథ్, చైర్మన్ మెస్రం తుకారాం, పటేల్ వెంకట్రావ్, నాయకులు నరేష్ జాదవ్ ఉన్నారు.

ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

కడెం ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కడెం ప్రాజెక్టును నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు గేట్లను ఇన్‌స్పెక్టర్ పింటు నంది పరిశీలించారు. అనంతరం పాండ్వాపూర్ గ్రామంలో ప్రకృతి విపత్తుల కారణంగా జరిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు పొలాలకు వెళ్లినప్పుడు జరిగే విపత్తుల గురించి, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఎలాంటి వైద్య చికిత్సలు అందించాలని అనే విషయాల గురించి తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే వరదలు, ఆ సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలో, ఎదుటివారిని ఎలా రక్షించాలి అనే విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారి వెంట తహసీల్దార్ సుజాత, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అకౌంటెంట్ జనరల్‌గా మాధవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)గా పి మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2001 ఇండియన్ ఆడిట్, అకౌంట్ సర్వీస్ బ్యాచ్‌కు చెందిన మాధవి ప్రస్తుతం కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ హోదాలో ఉన్నారు. గతంలో మహారాష్ట్ర ఎజిగా, చెన్నయ్ ప్రాంతీయ శిక్షణా సంస్థ డైరెక్టర్‌గా, ఆడిట్ ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పనిచేశారు. కొలంబో, పోర్ట్‌లూయిస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, న్యూయార్క్‌లోని యూఎన్ఎంఇఇఆర్‌లోనూ ఆడిట్‌లను నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

సామ్‌సంగ్ నుంచి ఎస్ఎస్‌డి 990 ఇఒ

న్యూఢిల్లీ : కంప్యూటర్ల ఇంటర్నల్ స్టోరేజీ, సామర్థ్యం పెంచడానికి ఎస్ఎస్‌డి 990ఇవోను ఆవిష్కరించినట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. గేమింగ్, పని, వీడియో, ఫోటో ఎడిటింగ్ తదితర రోజువారి కంప్యూటింగ్ అనుభవాలను మెరుగుపర్చడానికి ఇది దోహదం చేయనుందని పేర్కొంది. ఎస్ఎస్‌డి 990 ఇవోతో అధునాతన మెమోరీ సాంకేతికతలను ఉపయోగించుకోవడం, వినియోగదారుల డేటా నిల్వ అవసరాల కోసం బహుముఖ పనితీరును కనబర్చనుందని సామ్‌సంగ్ ఇండియా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ సేథి పేర్కొన్నారు. ఎస్ఎస్‌డి 990ఇవో 1టిబి వేరియంట్ ధరను రూ.9999గా నిర్ణయించినట్లు తెలిపారు.

కండక్టర్‌పై యువతి దాడి

- కేసు నమోదు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఆర్టీసి బస్సులో ఓ యువతి రెచ్చిపోయింది. కండక్టర్‌ను కాలితో తన్నుతూ.. దుర్భాషలాడింది. అందుకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. దాంతో ఆమెపై కేసు నమోదైంది. వివరాల్లోకెళ్తే.. ఈనెల 25న హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులో ఓ యువతి ఎల్‌బినగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు ప్రయాణం చేసింది. ఈ క్రమంలో కండక్టర్ గంగాధర్ ఆమెను ఆధార్ కార్డ్ చూపాలని కోరాడు. దాంతో కోపోద్రిక్తులైన ఆమె.. కండక్టర్‌ను దుర్భాషలాడింది. అనంతరం అతన్ని కాలితో తన్నింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఆర్‌టిసి ఎండి సజ్జనార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఎండి ఆదేశాల మేరకు హయత్‌నగర్ 1 డిపో మేనేజర్ విజయ్ బుధవారం ఎల్‌బి నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలి

- మార్కెటింగ్ శాఖ, సిసిఐ, ప్రయివేటు వ్యాపారుల కుమ్మక్కు
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోలు విషయంలో మార్కెటింగ్ శాఖ, సిసిఐ, ప్రయివేటు వ్యాపారుల కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రైతుల వద్ద ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూరు రోడ్‌లోని అన్నపూర్ణ సిసిఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, రాస్తారోకో చేశారు. పత్తిని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. పత్తిని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడుతున్న రైతులకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో చలిలో రాత్రిపూట రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిసిఐ కొనకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారన్నారు. క్వింటాల్ పత్తికి సిసిఐ రూ.7020కి కొనుగోలు చేస్తే ప్రయివేటు వ్యాపారులు రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేలకు కొంటున్నారని తెలిపారు. ప్రయివేటు వ్యక్తులు, సిసిఐ, మార్కెట్ అధికారులు కుమ్మక్కై రైతులకు నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు భూషణం, ఏసోబు, ప్రసాద్, రైతులు జగదీష్, భాస్కర్, రవి, బాలమని, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నేతలు

యూనివర్సిటీ ఆఫ్ లూయివెల్‌లో నేరుగా ప్రవేశాలు

- ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.11.50 లక్షలు
- ఆ సంస్థ ప్రతినిధి పాల్ హఫ్‌మన్ వెల్లడి

హైదరాబాద్ : విద్యాసంస్థ ద యూనివర్సిటీ ఆఫ్ లూయివెల్ హైదరాబాద్ నుంచి విద్యార్థులను నేరుగా తీసుకుంటున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ లూయివెల్‌కు చెందిన డాక్టర్ పాల్ హఫ్‌మన్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాణ్యమైన విద్యకు యూనివర్సిటీ ఆఫ్ లూయివెల్ ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులకు ఇష్టమైన గమ్యస్థానంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్న తమ ప్రణాళికలో భాగంగానే హైదరాబాద్‌కు వచ్చామన్నారు. నాణ్యమైన విద్య విషయంలో ఏమాత్రం రాజీ పడకుండానే ఫీజులు అందుబాటులో ఉండేందుకు వీలుగా మా ఎంఎస్ ఇంజినీరింగ్ కోర్సులకు ప్రభుత్వ ట్యూషన్ ఫీజులను మేం అర్హులైన విద్యార్థులకు అందిస్తున్నాం. ఈ కార్యక్రమం కింద విద్యార్థులు ఎన్ని క్రెడిట్లు అన్నదాంతో సంబంధం లేకుండా, సంవత్సరానికి కేవలం 13,800 డాలర్లు (సుమారు రూ.11.50 లక్షలు) ట్యూషన్ ఫీజు కడితే సరిపోతుందన్నారు.

బిగ్ సిలో గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

సామ్‌సంగ్ బ్రాండ్ ఇటీవల ఆవిష్కరించిన గెలాక్సీ ఎస్ 24 సీరిస్ స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ 'సి' వెల్లడించింది. బుధవారం మాదాపూర్‌లోని బిగ్ సి స్టోర్‌లో ఈ స్మార్ట్‌ఫోన్‌లను సంస్థ ఆ సిఎండి యం బాలు చౌదరీ, డైరెక్టర్లు, సినీతారా మృణాల్ ఠాకూర్, సామ్‌సంగ్ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలు చౌదరీ మాట్లాడుతూ.. గెలాక్సీ ఎస్24 అల్ట్రా, ఎస్24 ప్లస్‌లు అత్యంత అధునాతనమైన ఫీచర్లను కలిగి ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా పేరొందిన బిగ్‌సిలో కొనుగోళ్లకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కొత్త ఫోన్లను ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని నటీ మృణాల్ ఠాకూర్ పేర్కొన్నారు.

ఆరాంఘర్‌లో దోపిడీ దొంగల బీభత్సం

- సెక్యూరిటీ గార్డును చంపి ఇనుప రాడ్లు ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్‌లో అర్ధరాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. సెక్యూరిటీ గార్డును చంపి ఇనుప రాడ్లు ఎత్తుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్ చౌరస్తాలో మహబూబ్ అనే వ్యక్తి ఇనుప రాడ్ల గోదాముని ఏర్పాటు చేశారు. గోదాంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్ (25) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి గోదాంకు తాళం వేసి మహబూబ్ వెళ్లిపోయాడు. అందులో ఒక గదిలో సెక్యూరిటీ గార్డు మాత్రమే ఉన్నాడు. బుధవారం ఉదయం గోదాంకు వచ్చిన మహబూబ్ తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా ఆసిఫ్ రక్తం మడుగులో చనిపోయి ఉన్న దృశ్యం కనిపించింది. గోదాంలో ఉన్న సిసి కెమెరాలు కనిపించలేదు. వెంటనే మహబూబ్ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. దుండగులు మొదటగా గుర్తుపట్టకుండా ఉండడానికి సిసి కెమెరాలు పూర్తిగా ధ్వంసం చేసి వారి వెంట తీసుకెళ్లారు. దొంగతనానికి వచ్చిన దుండగులను సెక్యూరిటీ గార్డు ఆసిఫ్ ఆపడంతో అతడిపై విచక్షణరహితంగా దాడి చేసి కొట్టి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కాళేశ్వరంపై సర్కారుకు 'కాగ్' నివేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రాజెక్టు పనితీరుకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును సర్కారుకు అందజేసినట్టు అకౌంటెంట్ జనరల్ తెలిపారు. వచ్చే శాసనసభతోపాటు మండలి సమావేశాల్లో కాగ్ నివేదిక ప్రవేశపెట్టనున్నారు. దీనిపై శాసనసభ్యులు ప్రశ్నోత్తరాలోనూ ప్రశ్నించే అవకాశం లేకపోలేదు. భారీగా ఖర్చుపెట్టిన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వమే చర్చకు పెట్టనుందనే సమాచారం. కాళేశ్వరం ప్రణాళిక, పనులు, అంచనా వ్యయం, అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణపై కాగ్ ఆడిట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. పనుల పురోగతి, భూసేకరణ, సహాయ-పునరావాసం, డిజైన్ల ఖరారు, ఒప్పందాలు, ప్రణాళిక అంచనాల తయారీ, వృథా ఖర్చు, టెండరింగ్ విధానం, బిల్లుల చెల్లింపులపైనా ఆడిట్ చేపట్టారు. ప్రాజెక్టులపై కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణలతో కూడిన పూర్తి వివరాలను రిపోర్టులో కాగ్ పొందుపరిచింది. రానున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ నివేదిక ఉభయసభల ముందుకు రానుంది. ఈ మేరకు బుధవారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి), హైదరాబాద్ శాఖ 'ఎక్స్'లో షేర్ చేసింది.

'మహాలక్ష్మి'పై హైకోర్టులో విచారణ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించిన జీవో నెంబర్ 47 రద్దు చేయాలని కోరుతూ నాగోలుకు చెందిన హరీందర్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా ఆయన ఈ కేసును దాఖలు చేశారు. అయితే దీనిలో ప్రజాప్రయోజనం ఏమీ లేదనీ, ఆ పిటీషన్‌ను రిట్‌గా పరిగణించాలని న్యాయస్థానం హైకోర్టు రిజిస్ట్రార్‌కు సూచించింది. ఉచిత ప్రయాణం వల్ల బస్సుల్లో రద్దీ పెరిగిందనీ, కుటుంబంతో కలిసి వెళ్లినప్పుడు బస్సులో నిలబడే పరిస్థితి కూడా లేదని పిటీషనర్ పేర్కొన్నారు. పిటీషనర్ ఇబ్బంది ఎదుర్కొని పిల్ దాఖలు చేశారనీ, దాన్ని తాము అర్థం చేసుకోగలమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసుపై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.